విలేకరులు కావలెను
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లో
వెలువడుతున్న మన జైత్రయాత్ర
దినపత్రికలో అన్నీ మండలాల
వారిగా, అన్నీ నియోజకవర్గాల
వారిగా, అన్నీ జిల్లాల వారిగా
విలేకరులు కావలెను
సంప్రదించండి
సెల్ 9494876071

మాకలం బలం కోసం కాదు బలహీనుడి కోసం
PRGI No: APTEL/25/A3999
MANA JAITRAYATHRA
మన జైత్రయాత్ర
తెలుగు దినపత్రిక DAILY
www.manajaitrayathra.com

Published By తిరుపతి /చిత్తూరు ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ గురువారం 22-01-2026 పేజీలు - 8

VOLLUME : 1 ISSUE : 55 EDITOR : S RAMESH PAGES : 8 PRICE:- 2/-

# దావోస్ వేదికగా ఏపీకి పెట్టుబడుల వర్షం

## ఉక్కు, పర్యాటకం, ఏఐ రంగాల్లో కీలక ఒప్పందాల దిశగా అడుగులు ,పరిశ్రమల అనుమతులకు టైమ్‌లైన్ ఖరారు చేసిన సీఎం చంద్రబాబు

**దావోస్, మన జైత్రయాత్ర , జనవరి 21:--** ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు పూర్తిగా తలమునకలై ఉన్నారు. దావోస్ పర్యటన మూడో రోజున ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలతో వరుస సమావేశాలు నిర్వహించిన సీఎం, రాష్ట్రానికి భారీ పరిశ్రమలను తీసుకురావడమే లక్ష్యంగా జరిపిన చర్చల్లో స్పష్టమైన పురోగతి సాధించారు. ముఖ్యంగా ఉక్కు, పర్యాటకం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులకు మార్గం సుగమమైంది.




**అనకాపల్లి స్టీల్ ప్లాంట్‌కు ముహూర్తం :-** దావోస్‌లోని ఏపీ లాంజ్‌లో సీఎం చంద్రబాబుతో అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, సీఈవో ఆదిత్య మిట్టల్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ కూడా పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లాలో అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ సంస్థ ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు కర్మాగారం పురోగతిపై విస్తృతంగా చర్చ జరిగింది. తొలి దశలోనే సుమారు రూ.60 వేల కోట్ల పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. పరిశ్రమకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న అనుమతులు, భూసేకరణ అంశాలపై లక్ష్మీ మిట్టల్ సమక్షంలోనే సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 15లోగా అన్ని అనుమతులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం శంకుస్థాపన చేపట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి జాప్యం ఉండదని, అవసరమైతే ఢిల్లీ వెళ్లి కేంద్రం నుంచి అనుమతులు సాధించాలని మంత్రులకు సీఎం సూచించారు. ప్లాంట్ పురోగతిని మంత్రి లోకేష్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆదిత్య మిట్టల్ ప్రశంసించారు.

**ఏపీలో పర్యాటకానికి పెద్దపీట:-** ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థ తమారా లీజర్ సీఈవో సృష్టి శిబులాల్తో సీఎం చంద్రబాబు సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. పర్యాటక రంగ ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించామని, పెట్టుబడులకు ఏపీ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు.

పోలవరం నుంచి భద్రాచలం వరకు గోదావరి తీర ప్రాంతం, కోనసీమ, గండికోట, అరకు, లంబసింగి వంటి ప్రాంతాల్లో అద్భుతమైన టూరిజం కేంద్రాల అభివృద్ధికి అవకాశం ఉ ందన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు రోడ్లు, విమానాశ్రయాల కనెక్టివిటీ ఉందని, హోటల్ రంగానికి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తుందని హామీ ఇచ్చారు. పర్యాటకం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడటంతో పాటు ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని సీఎం వివరించారు.

**ఎకో-టూరిజం, హోమ్ స్టేలపై తమారా ఆసక్తి :-** సీఎం ప్రతిపాదనలపై తమారా లీజర్ సంస్థ సానుకూలంగా స్పందించింది. గిరిజన ప్రాంతాల్లో పర్యావరణ హితమైన ఎకో–టూరిజం పార్కులు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపింది. విశాఖపట్నం సహా ఇతర ప్రాంతాల్లో హోమ్ స్టే ప్రాజెక్టులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. 'కమ్యూనిటీ ఫస్ట్' విధానంతో గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారిని ప్రాజెక్టుల్లో భాగస్వాముల్ని చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సరైన ప్రతిపాదనలతో వస్తే పూర్తి సహకారం అందిస్తామని సీఎం స్పష్టం చేశారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నైపుణ్యాభివృద్ధి :-** టెక్నాలజీ రంగంలోనూ ఏపీని అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో కాలిబో ఏఐ అకాడెమీ వ్యవస్థాపకుడు రాజ్ వట్టికూటి, సీఈవో స్కాట్ శాండ్స్ఫెర్తో సీఎం చర్చలు జరిపారు. ఇప్పటికే వట్టికూటి ఫౌండేషన్ భాగస్వామ్యంతో అమరావతిలో ఏఐ అకాడెమీ ద్వారా యువతకు శిక్షణ అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాలకు విస్తరించి మరింత మంది యువతకు ఏఐ నైపుణ్యాలు అందించాలని సీఎం ప్రతిపాదించారు. విశాఖపట్నం మధురవాడ ఐటీ సెజ్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయాలని కాలిబో సంస్థను చంద్రబాబు ఆహ్వానించారు. మొత్తంగా దావోస్ వేదికగా సీఎం చంద్రబాబు చేపట్టిన వరుస సమావేశాలు ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమలు, పెట్టుబడులు, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా నిలబెట్టే దిశగా కీలక మలుపుగా మారాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# రథసప్తమి ఏర్పాట్లపై మంత్రి అనిత సమీక్ష

**శ్రీకాకుళం,మన జైత్రయాత్ర , జనవరి 21 :-** రథసప్తమి పండుగను పురస్కరించుకుని అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి అనిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో భక్తుల భద్రత, సౌకర్యాలపై విస్తృతంగా చర్చించారు. రథసప్తమి సందర్భంగా ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని, భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని మంత్రి అనిత అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో పోలీస్ బందోబస్తు పెంచడం, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ, అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, స్థానిక ఎమ్మెల్యే గోండు శంకర్తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, రూట్ డైవర్షన్లపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించారు.



భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అనిత స్పష్టం చేశారు. రథసప్తమి వేడుకలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జరగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు వైయస్ జగన్ భరోసా

**తాడేపల్లి,మన జైత్రయాత్ర , జనవరి 21:-** వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ను పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం తేలుకుట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చల్లా నాగరాజు కలిశారు. 2024 అక్టోబర్‌లో టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన నేపథ్యంలో నాగరాజు తన ఆవేదనను పార్టీ అధినేతకు వివరించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్‌గా పనిచేసిన కారణంగా టీడీపీ గూండాలు రాడ్లతో దాడి చేసి తన రెండు కాళ్లు విరగ్గొట్టారని నాగరాజు తెలిపారు. ఆ దాడి తర్వాత పూర్తిగా వీల్‌చైర్‌కే పరిమితమై కుటుంబ పోషణ తీవ్రంగా ఇబ్బందిగా మారిందని వివరించారు. తనపై జరిగిన దాడి తీరును, ఆ తర్వాత తన కుటుంబాన్ని ఎదుర్కొంటున్న వేధింపులను కూడా వైయస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్పందించిన వైయస్ జగన్, నాగరాజు కుటుంబాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం తమ బాధ్యత అని స్పష్టం చేస్తూ, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ భేటీలో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, స్థానిక నాయకులు, లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు నాగరాజుకు సంఘీభావం ప్రకటిస్తూ అండగా నిలిచారు.



# కిష్త్వార్‌లో ఐఏఎఫ్ విజయవంతమైన నైట్ మెడివాక్

**న్యూఢిల్లీ, మన జైత్రయాత్ర :-** కిష్త్వార్ సెక్టార్‌లో భారత వైమానిక దళం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో నైట్ టైమ్ మెడికల్ ఎవాక్యుయేషన్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. కఠిన భూభాగం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య ఇద్దరు తీవ్రంగా గాయపడిన సిబ్బందిని సురక్షితంగా గాలిమార్గంలో తరలించింది. ఈ ఆపరేషన్‌లో అత్యంత ఖచ్చితత్వం సాధ్యమవడానికి రాత్రి వేళల్లో నైట్ విజన్ గాగుల్స్ ద్వారా నిర్వహించిన కఠిన శిక్షణ కీలకంగా నిలిచింది. పర్వత



ప్రాంతాల్లో చీకటి వేళల్లో నిర్వహించే ప్రత్యేక శిక్షణ వల్ల సిబ్బంది పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొగలిగారని అధికారులు తెలిపారు. ఈ స్థాయి సన్నద్ధత 'జాయింట్ ఆప్స్ స్టామినా హోనింగ్' (జోష్) విన్యాసాల ద్వారా సంస్థాగతంగా బలపడిందని పేర్కొన్నారు. ఈ విన్యాసాలు సైనిక దళాల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్టం చేసి, అన్ని విభాగాల్లో ఏకీకృతంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందిస్తున్నాయి. ఈ మెడివాక్ ఆపరేషన్ ద్వారా భారత వైమానిక దళం తన వృత్తిపరమైన నైపుణ్యం, శిక్షణా పరమైన కట్టుదిట్టతను మరోసారి చాటుకుంది. అన్ని వాతావరణాల్లో, పగలు ▪ రాత్రి తేడా లేకుండా ఆపరేషన్‌లు నిర్వహించగల సామర్థ్యం తమకుందని స్పష్టం చేస్తూ, అవసరమైన వేళ ఎక్కడైనా, ఎప్పుడైనా మిషన్ విజయాన్ని సాధించగల శక్తిని ఐఏఎఫ్ మరోసారి నిరూపించింది.

# గ్రీన్‌ల్యాండ్ మంచు కింద వెలుగులోకి వచ్చిన అమెరికా రహస్య అణు స్థావరం

**ఉత్తర గ్రీన్‌ల్యాండ్,మన జైత్రయాత్ర, ఏప్రిల్:-** ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా అత్యంత రహస్యంగా నిర్మించిన ఒక సైనిక స్థావరం దశాబ్దాల తర్వాత మళ్లీ వెలుగులోకి వచ్చింది. గ్రీన్‌ల్యాండ్‌లోని మందమైన మంచు పొరల కింద కూరుకుపోయిన 'క్యాంప్ సెంచురీ' అనే ఈ స్థావరాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా శాస్త్రవేత్తలు తాజాగా నిర్వహించిన రాడార్ పరిశీలనలో అనుకోకుండా గుర్తించారు. ఇది సాధారణ శాస్త్రీయ పరిశోధనలో భాగంగా జరిగిన ఆకస్మిక ఆవిష్కరణ కావడం విశేషంగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో నాసా శాస్త్రవేత్తలు ప్రత్యేక పరిశోధనా విమానంలో ఉత్తర గ్రీన్‌ల్యాండ్ ప్రాంతం మీదుగా ప్రయాణిస్తున్నారు. ఈ సందర్భంగా ఆధునిక రాడార్ వ్యవస్థను పరీక్షిస్తుండగా, పిటుఫిక్ అంతరిక్ష స్థావరానికి సుమారు రెండు వందల కిలోమీటర్ల దూరంలో మంచు కింద సహజంగా ఉండని సరళ రేఖా ఆకృతులు స్పష్టంగా కనిపించాయి. రాడార్ సంకేతాలను చారిత్రక పటాలతో పోల్చి చూసిన అనంతరం, అవి 'క్యాంప్ సెంచురీ' అవశేషాలేనని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. పందొమ్మిది వందల యాభై తొమ్మిదిలో అమెరికా సైనిక ఇంజినీర్లు ఈ స్థావరాన్ని నిర్మించారు. 'మంచు కింద నగరం'గా పిలిచే ఈ కేంద్రంలో, మంచు పొరల కింద సుమారు ఎనిమిది మీటర్ల లోతులో విస్తృత సొరంగాలు తవ్వి, వాటి మీద మళ్లీ మంచును కప్పేశారు. దాదాపు రెండు వందల మంది సిబ్బంది నివసించేలా నివాస గృహాలు, ప్రయోగశాలలు, కార్యాలయాలు ఏర్పాటు చేశారు. పోర్టబుల్ అణు విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ సరఫరా కొనసాగింది. వాస్తవానికి ఇది 'ప్రాజెక్ట్ ఐస్‌వర్మ్' అనే అత్యంత రహస్య ప్రణాళికలో భాగం.



సోవియట్ యూనియన్‌ను లక్ష్యంగా చేసుకుని అణు క్షిపణులను మంచు కింద దాచాలన్నదే ఈ వ్యూహం. అయితే, గ్రీన్‌ల్యాండ్‌లో మంచు కదలికలు ఊహించిన దానికంటే వేగంగా జరుగుతున్నాయని గుర్తించిన అమెరికా, ఈ ప్రాజెక్టు భద్రతాపరంగా సురక్షితం కాదని నిర్ణయించింది. దీంతో పందొమ్మిది వందల అరవై ఏడేళ్ల నాటికి క్యాంప్ సెంచురీని పూర్తిగా వదిలేశారు. కాలక్రమేణా మంచు మరింత పేరుకుపోవడంతో ప్రస్తుతం ఈ స్థావరం అవశేషాలు సుమారు ముప్పై మీటర్ల లోతులో కూరుకుపోయి ఉన్నాయి. అణు రియాక్టర్‌ను తొలగించినప్పటికీ, రసాయనిక, జీవ, రేడియోధార్మిక వ్యర్థాలు అక్కడే మిగిలిపోయాయి. వాతావరణ మార్పుల కారణంగా మంచు కరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో ఈ వ్యర్థాలు బయటపడి పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారవచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వంలో రైతులే రాజులు

## 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ.

### ఆర్.బి.కె ద్వారా రైతులకు యూరియా ఇవ్వడం జరుగుతుంది.-కొమరాడ మండల తెలుగు రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీను.

**జియ్యమ్మవలస/కొమరాడ/ మన జైత్రయాత్ర /జనవరి 21**



హొరాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, వారిని నిజమైన రాజులుగా మారుస్తోందని కొమరాడ మండల తెలుగు రైతు అధ్యక్షుడు బత్తిలి శ్రీను కొనియాడారు. బుధవారం కొమరాడ మండలంలోని రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలోని ముఖ్యాంశాలను వెల్లడించారు: వేగవంతమైన చెల్లింపులు:హొగతంలో ధాన్యం అమ్ముకున్న తర్వాత డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని, కానీ నేడు ముఖ్యమంత్రిహొనారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిహొపవన్ కళ్యాణ్హొకృషితో ధాన్యం కొనుగోలు చేసినహొ24 గంటల్లోనేహొనేరుగా రైతు ఖాతాల్లో నగదు జమ అవుతోందని తెలిపారు.భూ సర్వే - పాస్ బుక్కులు:హొనిలిచిపోయిన భూముల రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేసి, తప్పుల్లేని పాస్ బుక్కులను రైతులకు అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు.సాగు పనులకు ఆటంకం కలగకుండా రెండో విడత యూరియాను రైతు భరోసా కేంద్రాల ద్వారా నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.కురుపాం మ్మెల్యేహొతోయక జగదీశ్వరిహొనేతృత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని బత్తిలి శ్రీను తెలిపారు. ముఖ్యంగా కొమరాడ మండలంలో రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని.అనేక అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు కార్యకర్తలు అగ్రికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలి- సిపిఐ ఎమ్ ఎల్ రెడ్ స్టార్, జిల్లా కార్యదర్శితోట జీవన్న

**జియ్యమ్మవలస /మన జైత్రయాత్ర /జనవరి 21**



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని అలాగే పని హక్కును కాపాడాలని సిపిఐ ఎమ్ఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోటజీవన్న డిమాండ్ చేశారు,అలాగే కార్మిక చట్టం రాష్ట్రానికి భారం కార్పొరేట్లకు లాభశీ కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కాబట్టి జనవరి నెల నుండి వరకు జియమ్మవలస మండలములోని అర్నాడు పంచాయతీ పరిధిలో ఉన్న కొత్త వలస గ్రామములో ఇంటింటి ప్రచారం చేయడమైనది, ఈ సందర్భంగా మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం కమ్యూనిస్ట్ పార్టీల పోరాటఫలితంగా 2005 వసంవత్సరంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం ప్రారంభించడం జరిగిందని అయితే ఇలాంటి సందర్భంలో ఈరోజు కేంద్ర ప్రభుత్వంలో గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2025 వ సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేసి వి బి జి రాంజీ స్కీమ్ తేవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పేద రైతులకు నష్టం జరిగే పరిస్థితి ఉందని దీనివల్ల పని హక్కు కోల్పోతున్నారని ఈ పథకం అమల వల్ల వ్యవసాయ కార్మికులకు పని గ్యారంటీ లేదని ఈ చట్టం వల్ల కార్పొరేట్లకు లాభం వ్యవసాయ కూలీలకు నష్టం జరిగే పరిస్థితి ఉందని, కార్పొరేట్ వర్గాలు సౌకర్యాల కోసం శ్రమ కోసం వేతనాలు తగ్గింపు కోసం లేబర్ కోడ్ లను తెచ్చారని, గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు పెంచాలనే ఉద్దేశం తో ఉపాధి చట్టం మార్చాలని కార్పొరేట్ల ఒత్తిడి మేరకే జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేయడం జరిగిందని ఇలాంటి సందర్భంలో ఎక్కువ మంది లేబర్ ఉంటే తక్కువ వేతనాలతో పని చేయించుకొని ఆర్థిక లాభం పొందవచ్చు నన్నది కార్పొరేట్ల దూరాలోచనకి ఇది ఉదాహరణని,ఇలాంటి సందర్భంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ పథకమును నిర్వీరం చేస్తూ వస్తున్నారని, 2021లో ఈ పథకానికి సంబంధించి లక్ష 11 వేలు కోట్ల రూపాయలు కేటాయించగా 2024 సంవత్సరంలో 2025వ సంవత్సరంలో కేవలం 86 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని ఇలాంటి సందర్భంలో పేదలకు ఉపయోగపడే ఈ పథకానికి నిధులు కేటాయించలేదని కానీ కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు మాత్రం లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీ రూపంలో అప్పగిస్తున్నారని అన్నారు, కాబట్టి ఇలాంటి సందర్భంలో పేదలకు వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని 2005 వసంవత్సరం లో గ్రామీణ ఉపాధి పథకంలో కేంద్రం 90 శాతం నిధులు ఇస్తే రాష్ట్రాలు పది శాతం నిధులు భరించే పరిస్థితి ఉందని ఇలాంటి సందర్భంలో కేంద్రం కొత్త చట్టాన్ని తెచ్చిన తర్వాత కేంద్రం 60% రాష్ట్రం 40% నిధులు భరించవలసిన పరిస్థితి వస్తుందని అన్నారు,ఇలాంటి సందర్భంలో ఇప్పటికే అప్పుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి నిధులు కేటాయించ లేవు అంతేకాక రాష్ట్రాలు ఖర్చు పెట్టాక కేంద్రం నిధులు ఇస్తాదని ఆ విధంగా ఈ పథకాన్ని క్రమేపి ఎత్తివేసే దురుద్దేశంతో నే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిందని కాబట్టి ఇటువంటి పథకాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం తెలుగుదేశం జనసేన వైసిపి పార్టీలు ఆమోదించటం సిగ్గుచేటని కాబట్టి ఈ కొత్త చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు,అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం కోసం సిపిఐ ఎమ్ ఎల్,రెడ్ స్టార్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ రోజు అనగా బుధవారం తెలిపిన గ్రామాల్లో ఇంటింటి ప్రచారం జరిగిన నేపథ్యంలో ఉపాధి కూలీలందరూ పెద్ద ఎత్తున ఈ క్యాంపియన్ లో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఉపాధి కూలీలకి కోరుచున్నాము ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్ ఎల్ రెడ్ స్టార్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, బిడ్డిక రమణ మూర్తి, ఉపాధి హామీ కూలీలు రమేష్, నాగ, ఉమా పాల్గొన్నారు.

## దివంగత టీడీపీ నాయకుడు రామ్మూర్తి రెడ్డి కి తుడా ఛైర్మన్ నివాళులు

### కుంట్రపాకంలో రామ్మూర్తి రెడ్డి 11వ నెల విస్తర కార్యక్రమం- పాల్గొన్న డాలర్స్ దివాకర్ రెడ్డి

**రేణిగుంట మన జైత్రయాత్ర జనవరి 21:-**



తెదేపా నాయకుడు రామ్మూర్తి రెడ్డి 11వ నెల విస్తర కార్యక్రమం తిరుపతి రూరల్ కుంట్రపాకంలో జరిగింది.ఈ కార్యక్రమానికి తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెదేపా నాయకుడు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు,బంధు మిత్రులు పాల్గొన్నారు.

## "రీ-సర్వేతో భూ వివాదాలకు చెక్.

### పట్టాదారులకు కొత్త పాస్‌పుస్తకాలు అందజేసిన తహశీల్దార్"చంద్రశేఖర్ రెడ్డి.

**రేణిగుంట,మన జైత్రయాత్ర జనవరి21:-**



మండల పరిధిలోని తాతయ్య కాల్వ గ్రామంలో రైతులకు రీ-సర్వే పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే ప్రక్రియ ముగిసిన అనంతరం, ఖచ్చితమైన కొలతలతో కూడిన కొత్త పాస్‌పుస్తకాలను రైతులకు అందజేశారు.ఎఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని రైతులకు స్వయంగా పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీ-సర్వే ద్వారా భూ రికార్డుల్లో పూర్తి పారదర్శకత వస్తుందని పేర్కొన్నారు. గతంలో ఉన్న భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడానికి మరియు భూ యజమానులకు తమ భూమిపై స్పష్టమైన హక్కులను కల్పించడానికి ఈ సర్వే ఎంతో దోహదపడుతుందని ఆయన వివరించారు.ఎరీ-సర్వే వల్ల భూ వివరాల్లో స్పష్టత రావడమే కాకుండా, భవిష్యత్తులో భూముల కొనుగోలు, అమ్మకాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగవని అధికారులు తెలిపారు. పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు, వాటిలోని తమ పేరు, విస్తీర్ణం మరియు ఇతర వివరాలను ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమకు పక్కాగా సర్వే చేసిన పాస్‌పుస్తకాలు అందడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## నో వర్క్.. నో పే' విధానం చట్టసభల్లో అమలుకావాలి

**అమరావతి, మన జైత్రయాత్ర :-**




ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. చట్టసభల్లో కూడా 'నో వర్క్.. నో పే' విధానం అమలులోకి రావాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. కొంతమంది ప్రజాప్రతినిధులు శాసనసభకు హాజరుకాకుండానే వేతనాలు తీసుకుంటున్నారని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. ఉద్యోగులు విధులకు రాకపోతే వేతనాలు నిలిపివేస్తారని గుర్తు చేస్తూ, ఎమ్మెల్యేల విషయంలో మాత్రం ఎందుకు అలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు.ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై మరింతగా ఉండాలన్నారు. శాసనసభ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరై చర్చల్లో పాల్గొనడం ఎమ్మెల్యేల కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 'నో వర్క్.. నో పే' విధానానికి అనుగుణంగా చట్టం రూపొందించే అంశంపై అఖిల భారత సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. ఈ విధానం అమలైతే శాసనసభల పనితీరు మెరుగుపడడంతో పాటు ప్రజల నమ్మకం మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## పోతిరెడ్డిపాడు పాదయాత్రకు 40 ఏళ్లు

**తిరుపతి,మన జైత్రయాత్ర , జనవరి 21 :-**




పోతిరెడ్డిపాడు పాదయాత్రకు 40 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా రాయలసీమ ఎత్తిపోతల పథకం భవిష్యత్తుపై తిరుపతిలో కీలక చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భూమన అభినయ్ రెడ్డి ఆధ్వర్యంలో, రాయలసీమ అధ్యయనాలు సంస్థ అధ్యక్షుడు భూమన సుబ్రమణ్యం రెడ్డి నిర్వహించారు.ఈ చర్చా కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సీపీఎం నేత కందారపు మురళి, మాజీ ఎమ్మెల్సీ యండమూరి శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ, శ్రీశైలం రిజర్వాయర్‌కి 302 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, పూడిక కారణంగా అది ప్రస్తుతం 202 టీఎంసీలకు పడిపోయిందన్నారు. కృష్ణా నదిలో రాయలసీమకు హక్కులే లేవన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 885 అడుగుల వద్ద నీరు ఉంటేనే పోతిరెడ్డిపాడుకు సరిపడ నీరు వచ్చే అవకాశం ఉంటుందని, కానీ జీవో 69 ద్వారా 834 అడుగుల పరిమితి పెట్టి రాయలసీమను నష్టపరిచారని ఆరోపించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి 854 అడుగులకు జీవో తీసుకువచ్చారని, ఆ తర్వాత రాజకీయాల కారణంగా దాన్ని నిలిపివేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం 800 అడుగుల వద్దనే కృష్ణా జలాలను తరలించుకుంటున్నదని, అదే సమయంలో రాయలసీమకు మాత్రం నీరు ఇవ్వడం లేదని అన్నారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి సుమారు రూ.7 వేల కోట్లు కేటాయించి ఖర్చు చేశారని చెప్పారు. జీవో 69 రద్దు కావాలంటే తెలంగాణ రాష్ట్ర అనుమతి అవసరమని, ఈ విషయంలో చంద్రబాబు తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి రాయలసీమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సీపీఎం నేత కందారపు మురళి మాట్లాడుతూ, రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో బీజేపీ పూర్తిగా మౌనం వహిస్తోందని విమర్శించారు. తాగునీటి అవసరాల కోసమే ఈ పథకం అత్యవసరమని, జగన్ హయాంలో 2023లో రూ.3,285 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించి వెయ్యి కోట్లకు పైగా ఖర్చు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని నిలిపివేయడం రాయలసీమ ప్రజలకు తాగునీరు లేకుండా చేయడమేనని ఆరోపించారు. ఈ ఉద్యమంలో సీపీఎం పూర్తిగా భాగస్వామ్యం అవుతుందని స్పష్టం చేశారు.తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ, రాయలసీమలో నీరు, ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లనే లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాల్సి వచ్చిందన్నారు. నిజమైన విజనరీలు వైయస్ రాజశేఖర్ రెడ్డి, వైయస్ జగన్ మోహన్ రెడ్డేనని చెప్పారు. రాయలసీమ మీదుగా ప్రవహించే నదిపై హక్కులు లేకుండా



చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో పోరాటం చేస్తామని తెలిపారు.ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ, వైయస్ కుటుంబమే రాయలసీమకు అత్యధిక మేలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం, తెలంగాణ ▪ ఏపీ సీఎంల రాజకీయ లబ్ధి కోసం రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రజా ఉద్యమం తప్పనిసరి అని పిలుపునిచ్చారు. మొత్తంగా ఈ చర్చా కార్యక్రమం రాయలసీమ ఎత్తిపోతల పథకం కేవలం అభివృద్ధి అంశం కాదని, ప్రాంత ప్రజల జీవన హక్కుల ప్రశ్నగా మారిందని వక్తలు స్పష్టం చేశారు. రాయలసీమకు న్యాయమైన నీటి వాటా సాధించే వరకు ఉద్యమం కొనసాగాలని ఈ వేదిక నుంచి బలమైన సంకల్పం వ్యక్తమైంది.

# దావోస్‌లో జెరోధా ఫౌండర్ నిఖిల్ కామత్‌తో మంత్రి లోకేష్ భేటీ

**దావోస్, జనవరి 21 : మన జైత్రయాత్ర**

ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ జెరోధా ఫౌండర్ నిఖిల్ కామత్తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దావోస్‌లో సమావేశమయ్యారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు నేపథ్యంలో జరిగిన ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌లో ఫిన్‌టెక్ రంగ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ప్లాట్‌ఫామ్ ఇంజనీరింగ్, బ్యాకెండ్ సిస్టమ్స్, ట్రేడింగ్ అల్గోరిథంలు, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ పరిశోధన అభివృద్ధి రంగాలపై దృష్టి సారిస్తూ విశాఖపట్నంలో ఒక ఆధునిక టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని జెరోధా ఫౌండర్‌ను కోరారు. విశాఖ నగరానికి ఉన్న మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ ఈ రంగానికి అనుకూలంగా ఉన్నాయని వివరించారు. ఫిన్‌టెక్ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, అధిక విలువ కలిగిన ఉ



ద్యోగావకాశాల సృష్టే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, వేగవంతమైన నిర్ణయాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్‌లో ఫిన్‌టెక్ పెట్టుబడులకు కొత్త దారులు తెరుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. 'ఆంధ్రా ఇజ్ బ్యాక్' నినాదంతో రాష్ట్రాన్ని పెట్టుబడులకు, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ భేటీ మరోసారి స్పష్టం చేసింది.

# జాతీయ కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి రక్ష

**కడప జనవరి 21:మన జైత్రయాత్ర**

తమ జాతీయ కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి రక్షణ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్ డి విజయ జ్యోతి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ ఆద్వర్యంలో విజయ జ్యోతి సమక్షంలో నగరంలోని (31 వ డివిజన్) గుర్రాల గడ్డ వీధిలో 150 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ లో చేరాయి, ఆమె అందరిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం విజయ జ్యోతి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆద్వర్యంలో నడుస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను కులం, మతం పేరుతో విడదీసి విచ్చిన్నం చేస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వానికి ఓటు





మాత్రమే ప్రజల ఆయుధమని దాంతోనే గద్దె దించేందుకు నడుంబిగించాలని పిలుపు నిచ్చారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో పేద బడుగు వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు లోని గాంధీ పేరును తొలగించడం దుర్మార్గమని ఆరోపించారు. ఇప్పటికే దేశ ప్రజలు నరేంద్ర మోడీ నయవంచన కుట్రలను గమనించి కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్నట్లు చెప్పారు. రాష్ట అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని చెప్పారు. యువనేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు అనం తరం నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ కడప లోని టిడిపి, వైసిపి నుంచి భారీగా వలసలు మొదల య్యాయని చెప్పారు. వై ఎస్ ఆర్ సి పి,టి డి పి ఇరు ప్రభుత్వం ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. దీంతో ప్రజలు తిరిగి సొంత గూటికి చేరుతున్నట్లు చెప్పారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కడప లోని 50 డివిజన్లలో పోటీ చేసి 30 డివిజన్లు గెలిచి మేయర్ పదవిని కైవసం చేసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ చేరిన వారిలో సాదిక్ సౌదాగర్, మున్నీర్ భాషా, ఖదీర్ భాషా, జిన్నా,మురాద్ భాషా, చరణ్, తిప్పన్న,భాస్కర్,రషీమున్నీ,నషీమ్ తదితరులు ఉన్నారు

# బాల్యాన్ని కాపాడుకుందాం – భవిష్యత్తును నిర్మిద్దాం

## గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో 'ప్రగతి' సంస్థ చైతన్య యాత్ర.-తిరుపతి జిల్లాలో 'బాల్య వివాహ విముక్తి రథం' ప్రారంభం.

**రేణిగుంట మన జైత్రయాత్ర జనవరి 21.**

బాల్య వివాహా విముక్తి రథం ప్రారంభ కార్యక్రమానికి మద్దతు!! భారత ప్రభుత్వము మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ కలసి ప్రారంభించిన 100 రోజుల ఇంటెన్సివ్ క్యాంపెయిన్లో భాగంగా, బాల్య వివాహ రహిత భారతదేశాన్ని తీర్చిదిద్దే మహత్తర లక్ష్యంతో, తిరుపతి జిల్లాలోని గిరిజన, గ్రామీణ ప్రాంతాల లో బాల్య వివాహాల అధిక ప్రబలత ఉన్న గ్రామాలకు చేరుకొని, తీవ్రంగా మరియు కాలపరిమితితో కూడిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించుటకు ప్రగతి సంస్థ "బాల్య వివాహాల విముక్తి రథం కార్యక్రమాన్ని ప్రారంభించుడమైనది.

తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి రేణిగుంట సీఐ జయచంద్ర , ఎస్సై ధర్మారెడ్డి ,యం ఈ.ఓ. రంగనాదం, డిప్యూటీ తహసిల్దార్, రేణిగుంట సర్పంచ్ నగేష్, గుత్తువారిపల్లి సర్పంచ్



మంజుల సంతకాలు పెట్టి వారి యొక్క మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళుతున్నటువంటి ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను ఉద్దేశించి సిఐ జయచంద్ర మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పైన జరుగుతున్న అఘాయిత్యాలలో బాల్య వివాహమనేది ఒకటి. బాల్య వివాహాల వలన పిల్లల యొక్క బాల్యాన్ని కోల్పోవడమే కాకుండా వారి జీవితంలో మానసిక ఒత్తిడిలకు లోనువుతారన్నారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థల ద్వారా జరుగుతున్నటువంటి ఇలాంటి అవగాహన కార్యక్రమాల వల్ల ప్రజల్లో మరియు పిల్లలలో కూడా బాల్య వివాహాల పైన అవగాహన పెరిగి జరగబోయే రోజుల్లో బాల్య వివాహాలు లేకుండా చేయడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ఆపడానికి తమ వంతు కృషి చేస్తామని ఆయన వారి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ, జిల్లా కోఆర్డినేటర్ రాజారెడ్డి, జయలక్ష్మి కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ కోటయ్య, లత మరియు ఇతరలు పాల్గొన్నారు.

# ఇసుక రీచులు, స్టాక్ పాయింట్లపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి -జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప జనవరి 21: మన జైత్రయాత్ర**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ ప్రక్రియ సజావుగా జరగాలని, ఇసుక రీచులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక లభ్యత, నూతన ఇసుక రీచ్ ల గుర్తింపు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా లతో కలసి జిల్లా స్థాయి సాండ్ కమిటీ (డిఎల్ఎస్ సి) సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్






చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధా నంలో ఎలాంటి సమస్యలు తలెత్త కుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. నూతన ఉచిత ఇసుక పాలసీ ప్రకారం ఉచిత ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని, స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుక రేట్స్ ను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఆయా రెవెన్యూ డివిజన్ల పరిధిలోని అన్ని ఇసుక రీచులను పరిశీలంచాలని ఆర్డీవోల ను ఆయన ఆదేశించారు. అక్కడ డీసిల్టేషన్ పాయింట్లు, కొత్త ఇసుక రీచుల ప్రతిపాదనలు, గుర్తింపు, సీసీ కెమెరాల పనితీరు మొదలైన అంశాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గనులు భూగర్భ శాఖ డిడి సుబ్ర మణ్యం, రీజినల్ ట్రాన్స్పోర్ట్, పోలీస్ అధికారులు, భూగర్భ గనులశాఖ, పిసిబీ శాఖ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కు సాదర వీడ్కోలు

**కడప,జనవరి 21: మన జైత్రయాత్ర -**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా లో ఒకరోజు పర్యటన ను ముగించుకొని బుధవారం స్టేట్ గెస్ట్ హౌస్ నుండి తిరుపతి కి బయలు దేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సాదర వీడ్కోలు పలికారు. స్టేట్ గెస్ట్ హౌస్ నందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన తిరుపతికి రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# మడకశిర వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో వైయస్ జగన్ భేటీ

**తాడేపల్లి,మన జైత్రయాత్ర , జనవరి 21 :-**

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ను శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కలిశారు. స్థానిక పాలనలో ఎదురవుతున్న అంశాలు, ప్రజల సమస్యలు, పార్టీ కార్యక్రమాల అమలుపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ భేటీలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, మడకశిర వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ ఈర లక్కప్పతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజలకు చేరువగా పార్టీ కార్యక్రమాలు అమలయ్యేలా సమన్వయంతో పనిచేయాలని నేతలు అభిప్రాయపడ్డారు. పార్టీ కేడర్‌ను మరింత బలోపేతం చేయడం, ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం



కొనసాగించడం అవసరమని నేతలు పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గంలో పార్టీ కార్యాచరణను మరింత చురుగ్గా కొనసాగించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

# ఆధునిక సాంకేతికతతోనే మహిళా సంఘాల బలోపేతం. ఎంపీడీవో కర్రీ ధర్మారావు

**జియ్యమ్మవలస / మన జైత్రయాత్ర జనవరి 21:-**

మండల సమాఖ్య సమావేశ మందిరంలో ఈ-నారి అలాగే సీఆర్పీ లకు నిర్వహిస్తున్న రెండవ రోజు శిక్షణా కార్యక్రమం బుధవారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఏపీఎం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో కర్రీ ధర్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మహిళా సంఘాల ప్రతినిధులు, వీవోఏలు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. సంఘాల్లో పొదుపు మరియు రుణాల నిర్వహణపై ఆయన పలు కీలక సూచనలు చేశారు: ప్రతి నెలా పొదుపు మొత్తాన్ని కేవలం అవసరమైన వారు మాత్రమే వాడుకునేలా చూడాలి. వడ్డీ రేట్ల నిర్ణయంపై స్పష్టమైన బైలా నిబంధనలు రూపొందించుకోవాలి. వసూలైన వడ్డీలను




పొదుపు ఖాతాల్లో భద్రపరచాలని, ఆ మొత్తాన్ని అవసరమైన సభ్యులకు రుణాలుగా ఇచ్చి, వడ్డీతో సహా సకాలంలో తిరిగి చెల్లించేలా టర్నోవర్ పెంచాలని ఉదాహరణలతో వివరించారు. ఆర్థికాంశాలతో పాటు గ్రామాల అభివృద్ధిలో ఈ-నారీలు విశేష కృషి చేయాలని ఎంపీడీవో ఉద్బోధించారు. ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై గ్రూపులన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఇంటి ముస్తాబుతో పాటు వీధి ముస్తాబు వీధుల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి. తాగునీటి వనరుల నిర్వహణ, ప్రతి శుక్రవారం 'ఫ్రైడే – డ్రై డే' పాటించడం ద్వారా వ్యాధుల నివారణకు కృషి చేయాలి. తడి-పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించాలి. మండలంలో బహిరంగ మలవిసర్జనను పూర్తిగా నిర్మూలించేలా మహిళా సంఘాలు చొరవ చూపాలి. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య సిబ్బంది, ఈ-నారీలు అలాగే సీఆర్పీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన న్యూస్
మీడియా, జాతీయ తెలుగు దినపత్రిక

మన న్యూస్
మీడియా, జాతీయ తెలుగు దినపత్రిక

మన న్యూస్
మీడియా, జాతీయ తెలుగు దినపత్రిక

# మన జైత్రయాత్ర

తెలుగు సినిమా వార్తలు

PRGI No: APTEL/25/A3999
www.manajaitrayathra.com

ఎడిటర్ : యస్ . రమేష్ manajaitrayathra@gmail.com www.manajaitrayathra.com 22 - 01- 2026


## 5 సినిమాలు.. 5 జానర్లు.. 5 బ్లాక్‌బస్టర్లు
## శివకార్తికేయన్ కెరీర్ పీక్ స్టేజ్!

మన జైత్రయాత్ర ,మన సినిమా :-



తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ (ఎస్కే) కెరీర్ ప్రస్తుతం పీక్ స్టేజ్‌లో కొనసాగుతోంది. కంటెంట్ ఆధారిత కథలను ఎంచుకుంటూనే కమర్షియల్ ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో బ్యాలెన్స్ చేస్తూ సినిమాలు చేస్తూ తమిళ సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. వరుసగా తన సినిమాలను రూ.100 కోట్ల క్లబ్‌లో చేర్చుతూ ఎస్కే తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపిస్తున్నారు. ముఖ్యంగా ఒక్కో సినిమా ఒక్కో జానర్‌లో తెరకెక్కినా, అన్నీ ఘన విజయాలుగా నిలవడం విశేషంగా మారింది. శివకార్తికేయన్ కెరీర్‌లో తొలి రూ.100 కోట్ల సినిమా 'డాక్టర్'. కరోనా వంటి కష్టకాలంలో విడుదలైనప్పటికీ, ఈ చిత్రం బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ ఎస్కేకి తొలి రూ.100 కోట్ల విజయాన్ని అందించింది. ఆ తర్వాత వచ్చిన 'డాన్' సాధారణ కాలేజ్ కథతో తెరకెక్కినా, యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టి భారీ వసూళ్లతో సంచలనం సృష్టించింది. ఇక 'అమరన్' సినిమా శివకార్తికేయన్ కెరీర్‌లో ఓ కీలక మలుపుగా నిలిచింది. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇస్తూ తెరకెక్కిన ఈ చిత్రం, ఎస్కేను మరో స్థాయి హీరోగా నిలబెట్టింది. పెద్దగా హడావుడి లేకుండా విడుదలైన 'మధరాసి' కూడా సైలెంట్‌గా రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరి, శివకార్తికేయన్ మార్కెట్ స్థాయిని మరోసారి రుజువు చేసింది. తాజాగా విడుదలైన పీరియాడిక్ మూవీ 'పరాశక్తి' అయితే ఎస్కే కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది. భారీ కథాంశం, గ్రాండ్ మేకింగ్‌తో రూపొందిన ఈ చిత్రం పీరియడ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, శివకార్తికేయన్ స్టార్‌డమ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది.

ఐదు సినిమాలు, ఐదు వేర్వేరు జానర్లు, ఐదు సార్లు రూ.100 కోట్ల కలెక్షన్లు ' ఈ అరుదైన రికార్డ్ ప్రస్తుతం తమిళ సినీ ఇండస్ట్రీలో ఒక్క శివకార్తికేయన్ పేరుపైనే ఉంది. ప్రయోగాలకు భయపడకుండా కథను నమ్ముకుని ముందుకు సాగితే స్టార్‌డమ్ తప్పకుండా వస్తుందనడానికి ఎస్కే నేటి తరానికి బెస్ట్ ఎగ్జాంపుల్‌గా నిలుస్తున్నారు.

## టొవినో థామస్ ప్రెస్టీజియస్ మూవీ
## "పల్లి చట్టంబి" మోషన్ పోస్టర్ విడుదల

మన జైత్రయాత్ర ,మన సినిమా :-




మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ భారీ బడ్జెట్ మూవీ "పల్లి చట్టంబి" మోషన్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ మోషన్ పోస్టర్ ద్వారా సినిమా రిలీజ్ డేట్‌ను కూడా అధికారికంగా ప్రకటించారు. వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కయదు లోహర్ నటిస్తోంది. ఈ రోజు విడుదలైన మోషన్ పోస్టర్‌తో పాటు, ఏప్రిల్ 9న ఈ సినిమాను హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురానున్నట్లు మేకర్స్ వెల్లడించారు. 1950 ' 60 దశకాల నేపథ్యంతో రూపొందుతున్న ఈ పీరియాడిక్ మూవీలో టొవినో థామస్ ఇప్పటివరకు చూడని విధంగా పూర్తిగా కొత్త అవతార్‌లో కనిపించనున్నారు. గ్రాండ్ మేకింగ్, భారీ కథాంశంతో రూపొందుతున్న "పల్లి చట్టంబి" మోషన్ పోస్టర్ విడుదలతో సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు భారీగా పెరిగాయి. టొవినో థామస్ కెరీర్‌లో మరో కీలక చిత్రంగా ఈ సినిమా నిలవనుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

## ఫిలిం ఛాంబర్‌లో 'ప్రేమ మధురం' టైటిల్ లాంచ్

మన జైత్రయాత్ర మన సినిమా :-

ఎన్.జి.ఆర్ సినిమా ప్రొడక్షన్, వి.ఎల్ 14 రీల్ సినిమా ప్రొడక్షన్ బ్యానర్స్‌పై ఎస్కే జలీల్, స్వామి దాసు నాగరత్నం నిర్మాణంలో పరకోటి బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ప్రేమ మధురం'. 'ఇద్దరూ ఒకటయ్యారు' అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమా టైటిల్ లాంచ్ కార్యక్రమం నేడు ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ చిత్రంలో చంటి హీరోగా నటిస్తుండగా, ఏపీ స్టేట్ క్రికెట్ ప్లేయర్ సంధ్యతో పాటు సుష్మ, దాక్షాయిని హీరోయిన్లుగా నటిస్తున్నారు. జబర్దస్త్ గడ్డం నవీన్, పంచ్ ప్రసాద్, వింజమూరి మధు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు ఫిలిం ఛాంబర్ కోశాధికారి ముత్యాల రామదాసు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న సినిమా తీయడం



చాలా కష్టంగా మారిందన్నారు. ఆసక్తితో సినిమా చేయడానికి వచ్చినా ఖర్చులు, విడుదల సమయంలో ఎదురయ్యే ఇబ్బందుల కారణంగా నిర్మాతలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయినప్పటికీ కొత్త నిర్మాతలు ముందుకు రావడం కళామతల్లి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. 'ప్రేమ మధురం' సినిమాకు తెలుగు ఫిలిం ఛాంబర్ పూర్తి అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. టైటిల్ లాంచ్ కార్యక్రమంతో సినిమాపై ఆసక్తి పెరుగుతుండగా, ప్రేమ కథాంశంతో రూపొందుతున్న 'ప్రేమ మధురం' ప్రేక్షకులను ఆకట్టుకునే చిత్రంగా నిలుస్తుందనే నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేసింది.

## 'చైనా పీస్' నుంచి పవర్‌ఫుల్ 'భగ భగ' సాంగ్ రిలీజ్

మన జైత్రయాత్ర ,మన సినిమా :-



నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాధ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'చైనా పీస్' నుంచి పవర్‌ఫుల్ పాట లిలి'భగ భగ'లిలిను మేకర్స్ విడుదల చేశారు. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇప్పటికే తన ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, డిఫరెంట్ ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. తాజాగా రిలీజ్ అయిన 'భగ భగ' సాంగ్ ఆ అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. కంపోజర్ కార్తీక్ దేశభక్తి రగిలించేలా ఈ పాటను స్వరపరిచారు. కాల భైరవ పవర్‌ఫుల్ వోకల్స్ పాటకు మరింత ఎనర్జీని అందించగా, రెహమాన్ రాసిన లిరిక్స్ పదాలను ఆయుధాలుగా మార్చి శ్రోతల హృదయాలను హత్తుకునేలా ఉన్నాయి. ఈ పాట సినిమా టోన్‌కు బలమైన హైప్‌ను తీసుకొచ్చింది. ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా సురేష్ రగుతు, ఎడిటర్‌గా మార్తాండ్ కె. వెంకటేష్ పని చేస్తున్నారు. ఫిబ్రవరి చివర్లో ఈ స్పై డ్రామా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, తాజాగా వచ్చిన 'భగ భగ' సాంగ్‌తో 'చైనా పీస్' సినిమా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతూ ముందుకు సాగుతోంది.


## అనిల్ రావిపూడి నెక్స్ట్ ప్రాజెక్ట్..
## రేసులో ఇద్దరు బడా హీరోలు!

మన జైత్రయాత్ర ,మన సినిమా :-




దర్శకుడు అనిల్ రావిపూడి బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలతో 'సక్సెస్‌ఫుల్ డైరెక్టర్'గా తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్నారు. ఇప్పటి వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలవడం విశేషం. ప్రస్తుతం ఉన్న సీనియర్ హీరోల్లో నాగార్జునను మినహాయిస్తే చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లతో సూపర్ హిట్ సినిమాలు తెరకెక్కించి తన సత్తాను చాటుకున్నారు. తాజాగా సంక్రాంతికి విడుదలైన మెగాస్టార్ చిరంజీవి నటించిన చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. గత సంక్రాంతికి వెంకటేష్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్‌బస్టర్ కొట్టిన అనిల్ రావిపూడి, ఈసారి మెగాస్టార్‌తో మెగా హిట్‌ను ఖాతాలో వేసుకున్నారు. ఈ రెండు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ రూ.300 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించిన దర్శకుడిగా రీజనల్ స్థాయిలో సరికొత్త రికార్డును క్రియేట్ చేశారు. దీంతో అనిల్ రావిపూడి నెక్స్ట్ ప్రాజెక్ట్ ఎవరితో ఉంటుందన్న అంశం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో వెంకటేష్‌తో మరో సినిమా ఉంటుందన్న వార్తలు వినిపిస్తుండగా, మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో కూడా అనిల్ సినిమా చేయబోతున్నారనే టాక్ జోరుగా నడుస్తోంది. దిల్ రాజుకు పవన్ కళ్యాణ్ డేట్స్ ఇవ్వడంతో, అనిల్ రావిపూడి దర్శకత్వంలోనే ఆ ప్రాజెక్ట్ ఉండే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వెంకటేష్, పవన్ కళ్యాణ్‌లలో ఎవరితో అనిల్ సినిమా చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఇద్దరిలో ఎవరు హీరోగా ఉన్నా వచ్చే సంక్రాంతికి మరో బ్లాక్‌బస్టర్ ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు సీక్వెల్ దాదాపు ఫిక్స్ అయినట్టుగా ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఆ సినిమా వెంకటేష్‌తోనే ఉంటుందని సమాచారం. అదే సమయంలో పవన్ కళ్యాణ్‌ను గెస్ట్ రోల్‌లో ప్లాన్ చేస్తారా? అనే చర్చ కూడా మొదలైంది. పవన్ కళ్యాణ్, వెంకటేష్‌ల మధ్య మంచి సాన్నిహిత్యం ఉండటం తెలిసిందే. గతంలో 'గోపాల గోపాల' సినిమాలో వీరిద్దరూ కలిసి నటించారు. చిరంజీవి సినిమాలో వెంకటేష్‌తో గెస్ట్ రోల్ మ్యాజిక్ చేసిన అనిల్ రావిపూడి, పవర్ స్టార్‌తో అంతకుమించిన సర్‌ప్రైజ్ ప్లాన్ చేస్తారేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





Printed,Published and Owned by S. Ramesh , Published at PLOT NO 232, 250 COLONY, VEDANTHAPURA AGRAHARAM, CHITTOOR, ANDHRA PRADESH - 517507. and Printed at M/s Vasantha Sreenivasula Reddy, VSAR Publications D. NO. 41/1077, Sankarapuram, Kadapa, Y.S.R., Andhra Pradesh - 516002. A.P Chief Editor : S.Ramesh , email:manajaitrayathra@gmail.com, Cell:9494876071, RNI(PRGI) No: APTEL/25/A3999